# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 24 -01-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. **దేశంలోని యువతకు భారత్‌లోనే కాకుండా విదేశాల్లో కూడా కొత్త అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు**
2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలో ఈరోజు పర్యటిస్తున్నారు.**
3. **సింగపూర్‌లో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రానికి చెందిన హస్తకళల వస్తువులను బహుమతులుగా అందజేయాలని అక్కడి రాయబార కార్యాలయం నిర్ణయించింది.**
4. **విశాఖపట్నంలో ఈ రోజు నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు విశాఖ ఉత్సవ్ ను నిర్వహిస్తున్నారు**

## 5. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 130వ సంచిక రేపు ప్రసారమౌతుంది.

-----------------------

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీ నుంచి దృశ్యమాధ్యమ విధానంలో నిర్వహించిన 18వ జాతీయ రోజ్‌గార్ మేళాలో పాల్గొన్నారు . దేశవ్యాప్తంగా 45 ప్రదేశాలలో 61 వేలకుపైగా నియామక పత్రాల అందించారు. నైపుణ్యం కలిగిన యువతకు మరిన్ని అవకాశాలు కలపిచ్చాడమే లక్ష్యంగా పలు దేశాలతో వాణిజ్య, మొబిలిటీ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటూ..

వాయిస్ 30 సెకన్స్

విశాఖపట్నంలో జరిగిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొని నియామక పత్రాలు అందజేశారు.

-----------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. నగరిలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం శాప్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్తూరు, బంగారుపాళ్యం, ఐరాలకు సంబంధించిన స్వచ్ఛ రథాలను ప్రారంభించారు.అనంతరం ప్రబుత్వం అమలు చేస్తన్న సంక్షేమపథకాలు గురించి ముఖ్యమంత్రి మాట్లాడారు

----------------------

సింగపూర్‌లో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రానికి చెందిన హస్తకళలను  బహుమతులుగా అందజేయాలని అక్కడి భారతీయ రాయబార కార్యాలయం నిర్ణయించింది. ఈ సందర్భంగా 400 ప్రత్యేక బహుమతుల తయారీకి లేపాక్షికి సింగపూర్‌లోని భారతీయ రాయబార కార్యాలయం ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర చేనేత, జౌళి పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. సవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహుమతులలో తోలు బొమ్మలాట , ఏనుగు ఆకారపు బ్యాగేజ్ ట్యాగ్, హస్త కళా రూపాలు వంటివి ఉండనున్నాయి. ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. గతేడాది రిపబ్లిక్ డేలో రాష్ట్ర హస్తకళల శకటానికి లభించిన గుర్తింపుతో ప్రాచుర్యం మరింత పెరిగిందని తెలిపారు. విశాఖపట్నం, అనంతపురం, కడపతో సహా 15 లేపాక్షి దుకాణాలు ఆధునీకరణ చేపడుతున్నామని, త్వరలో ఇతర దేశాల్లోనూ లేపాక్షి దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె  వెల్లడించారు.

----------------------

విశాఖపట్నంలో ఈ రోజు నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు విశాఖ ఉత్సవ్ ను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవ్ ను ఈ సాయంత్రం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, పర్యటక శాఖ మంత్రి  కందుల దుర్గేశ్ ప్రారంభిస్తారు. ఈ వేడుకకు సుమారు 10 లక్షల మంది పర్యాటకులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఉత్సవ్ లో భాగంగా

 బోటింగ్, బీచ్ వాలీబాల్, కబడ్డీ, హెలికాప్టర్ రైడ్స్, సైక్లింగ్, యోగా తదితర పోటీలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం స్థానిక కళాకారులు, జాతీయ స్థాయి సినీ తారలు, లైవ్ బ్యాండ్‌ల అద్భుత ప్రదర్శనలు, విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు, కామెడీ షోలు, నైట్ మార్కెట్లు, సంగీత విభావరిలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

-----------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  2015లో ప్రారంభించిన ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్  - ప్రగతి వేదిక 50వ సమావేశాన్ని విజయవంతంగా పూర్తి చేసి కీలక మైలురాయిని చేరుకుంది.ఈ వేదిక, ప్రధాన మౌలిక వసతి ప్రాజెక్టులు, ప్రజా సమస్యలపై ప్రత్యక్ష సమీక్షల ద్వారా పాలనలో వేగం, పారదర్శకత తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్రాలు, వివిధ మంత్రిత్వ శాఖలు ఒకే డిజిటల్ వేదికపై సమన్వయంతో పనిచేస్తే  సహకార సమాఖ్య వ్యవస్థకు ప్రగతి వ్యవస్థ  ఉదాహరణగా నిలిచింది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్‌లోని జాతీయ రహదారి–30పై రాయ్‌పూర్–కోడ్‌బోడ్ మధ్య 43 కిలోమీటర్ల నాలుగు లైన్ల రహదారి ప్రాజెక్టు  ప్రగతి  యంత్రాంగం ద్వారా కార్యరూపం దాల్చింది. 2016లో  987.88 కోట్ల రుపాయలతో ఆమోదించిన ఈ ప్రాజెక్టు, భూమి బదిలీ, సామగ్రి సరఫరా వంటి  సమస్యలతో ఆలస్యమైంది . 2023 ఫిబ్రవరిలో  ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమీక్ష అనంతరం వివిధ శాఖల మధ్య  సమన్వయంతో సమస్యలు పరిష్కారమై, ప్రాజెక్టు 100 శాతం పూర్తవడంతో  2023 జూన్ 20న ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

-----------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకూ.. 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా "స్వచ్ఛత పక్షోత్సవాలు"-స్వచ్ఛతా పక్వాడాను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత వాతావరణం పై అవగాహన కలిగించడం, సమాజ భాగస్వామ్యం పెంచడం, మొక్కల సంరక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మరో వైపు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనంతపురం, తిరుపతి, ఎన్టీఆర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, కృష్ణా జిల్లాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు, శాసనసభ్యులు పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు.

----------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

----------------------

డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాల్సిన బాధ్యత ఉందని ఈగల్ ఐజీ రవికృష్ణ అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఈగల్ టీం ఆధ్వర్యంలో వాకథాన్ ను ఈరోజు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తో కలిసి

ఆయన ప్రారంభించారు.  ఈ సందర్భంగా ఈగల్ ఐజీ రవికృష్ణ  మాట్లాడుతూ.. డ్రగ్స్ బారిన పడి యువత భవిష్యత్తును   నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ని మార్చడంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

----------------------

తిరుమలలో రేపు  రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం - టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 5 గంటల 30 నిమిషాలకు సూర్యప్రభ వాహనంతో  సేవలు ప్రారంభమవుతాయని పేర్కొంది. చిన్న శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలతో పాటు మధ్యాహ్నం 2 గంటలకు పుష్కరిణిలో చక్రస్నాన మహోత్సవం జరగనుందని టీటీడీ  తెలిపింది. తిరుమలలో భక్తుల రద్దీ దృష్ట్యా ఈరోజు నుంచి 3 రోజులు సర్వదర్శన టోకెన్లు జారీ రద్దు చేసినట్లు వెల్లడించింది.  రేపు వీఐపీ బ్రేక్, ప్రివిలైజ్ దర్శనాలతో సహా ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు టి టి డి వివరించింది.

----------------------